విలువలు మారుతున్నాయి. దాంతో పాటలు మారుతున్నాయి. పాటల్లో వేగం... జీవితంలో వేగం... దాన్ని అందుకోలేని బ్యాండుమేళం వృత్తి కళాకారుల జీవితాల్లో దైన్యం... పొట్ట గడవటమే కష్టమైతే పిల్ల పెళ్ళి చేయడం మరీ కష్టం. ఇదొక పార్శ్వం... మరోవైపు చాలినంత కట్నం తేలేదని కాల్చిచంపే భర్త ఘాతుకం... ఈ వాస్తవాల నేపథ్యంలో ఓ అమ్మాయి పెళ్ళి కలల చిత్తరువు చెదిరిపోయిన వైనం ఈ కథ.

# తెగిపోయిన పాట

పెళ్ళి ఊరేగింపు....

పడవలాంటి కారులో వధూవరులు... కారు ముందర సెంట్ల వాసనల్తో, పట్టుచీరెలు, నగలతో మెరిసిపోతున్న ఆడవాళ్లు... కారు వెనక హుందాగా నడుస్తున్న మగవాళ్లు... చిత్రమైన డ్రెస్సులతో భారీ సౌండ్‌తో ముందు బాజాలూదుతున్న బ్యాండ్‌వాళ్ల మధ్య తాగి వూగుతున్న యువకులు. దాదాపు పదిమంది వరకూ డాన్సులు చేస్తున్నారు. వాళ్లతో కలిసి ఒకరిద్దరు అమ్మాయిలు కూడా స్టెప్పులేస్తున్నారు.

అప్పటికే రెండున్నర గంటలైనా ఊరేగింపు అరకిలోమీటరు కూడా సాగలేదు. పిల్లలు భారీ ఎత్తున టపాకాయలు పేలుస్తుండటంతో చెవులు హోరెత్తుతున్నాయి. ఒక పెద్దమనిషి బ్యాండ్‌వాళ్ల దగ్గరికొచ్చి వాళ్లలోని బ్యాండ్ మాస్టర్‌ని "సలీం... ఇలాగైతే ఆర్నెల్లయినా ఇంటికి చేరం. తొందరగా నడవండి" అని చెప్పాడు. సలీం బాజా వూదుతూనే మిగతావాళ్లకి కదలమని సైగ చేశాడు. దాంతో డాన్స్ చేస్తున్న యువకులు బ్యాండ్‌వాళ్లని కదిలితే బావుండదని హెచ్చరించారు. వాళ్ల చేష్టలు చూసి చెప్పిన పెద్దమనిషి జారుకున్నాడు.

డాన్స్ చేస్తున్న ఇద్దరు యువకులు బాజా వూదుతున్న సలీంని "హిప్‌హిప్ తారారార...." పాప్‌సాంగ్ పాడమన్నారు.

"సినిమా పాటలు తప్ప వేరే పాటలు రావుసార్" ఊదటం ఆపి వినయంగా చెప్పాడు. సలీంకి యాభై ఏళ్లుంటాయి. "పోనీ.... దిల్‌హై హిందుస్తానలోది షారూఖ్ పాట పాడు. దానిమీద డాన్స్ చేయాలి"

"అదింకా ప్రాక్టీస్ చేయలేద్సార్. ఆ కేసెట్ నిన్నగాక మొన్ననే రిలీజైంది కద్సార్"

"మరి నీకేం పాటలొచ్చుబే... బాడ్‌ఖావ్..." బాగా తాగినవాడొకడు పైపైకొచ్చాడు.

"వచ్చిన పాటలు పాడుతున్నాం కద్సార్. మాటలు జాగర్తగా రానీయుండ్రి" సలీం కోపాన్ని అణుచుకుంటూ అన్నాడు.

"పాప్‌సాంగ్స్ ఏమీ పాడట్లేదు. నీకు రెస్పెక్టిచ్చేదేంట్రా... బొచ్చు..." మరొకడు సలీంని తోసేశాడు. సలీం తలపై పెట్టుకున్న ఎర్రటి కుచ్చుటోపీ కిందపడింది. డ్రమ్స్ వాయిస్తున్న కుర్రాడు సలీంని తోసేసిన యువకుడ్ని నిలదీసాడు. దాంతో అంతా కల్సి కుర్రాడ్ని కొట్టడం మొదలెట్టారు. బాజాల సౌండు ఆగిపోయింది. ఆ పెనుగులాటలో ఎవరో కుర్రాడు టపాకాయలు పేల్చాడు.

అంతా గోల... గోల....

పెళ్లికి వచ్చిన పెద్దలు బ్యాండ్ వాళ్లని, యువకుల్ని విడదీసారు. అందర్నీ సముదాయించారు. దాంతో యువకులంతా కసితో బ్యాండ్ వాళ్లని కదలనివ్వకుండా పేట్రేగిపోయి డాన్సులు చేయడం మొదలెట్టారు. వాళ్లు చెప్పినా వినే స్థితిలో లేరని అందరికీ తెల్సు. ఊరేగింపు ముసలి నత్తలా సాగింది. హోరెత్తిన వాయిద్యానికి నాలుగువేల రూపాయల బ్యాండ్ ఛట్‌మని పగిలింది.

** ** **

"రోజురోజుకీ నీకు చెవులు వినపడేలా లేవు. ఎలాగో ఏమో..." సలీం చెవుల్లో ఇయర్ డ్రాప్స్ వేస్తూ అంది కూతురు షబీనా.

పెళ్ళికెదిగిన బిడ్డవైపు బాధగా చూసాడు సలీం. షబీనా నవ్వింది. మల్లెపువ్వు లాంటి ఆ నవ్వు చూసి సలీం బాధనంతా మర్చిపోయాడు. పక్కనే వున్న పీకనందుకొని ఓ పాట ఊదాడు.

"పాట మంచిగుంది.... గిదే సిన్మాలోది నాన్నా..." అంది. "సిన్మాలోది కాదు బిడ్డా... ఇన్ని పాటలు వూది వూది నేనే ఓ రాగం కట్టిన. ఇది నా షబీనా పెళ్లికి మాత్రమే నేను ఊదేపాట" అన్నాడు.

పెళ్లి మాట విని షబీనా సిగ్గుపడిపోయింది.




"ఇన్ని పెళ్లిళ్ళకు బాజాలూదుతున్నా... నీకు మాత్రం పెళ్లి చేయలేకపోతున్నా బేటీ... కీబోర్డులొచ్చి మన పొట్ట కొట్టినయ్... చాలా పెండ్లిల్లకు రిక్షాలో మైకుసెట్లు, కీబోర్డు పెట్టుకొని వాయిస్తుండ్రు. ఒకప్పుడు సలీం బ్రాస్ బ్యాండ్ అంటే జిల్లాలో గొప్ప పేరుండేది. నలభైమంది వుండేవాళ్లం. ఇప్పుడు పదహారుమందికి తగ్గింది. అందరూ ఏదేదో పనులు చూసుకుంటూ వెళ్లిపోయారు. ఈ వృత్తిని నమ్ముకుంటే పెళ్లికూడు తప్ప మిగతా రోజుల్లో అన్నం ముద్ద కరువైంది. ముసలితనం వచ్చేసరికి చెవుడుతోపాటు గొంతు నరాలు, ఊపిరితిత్తులు పాడవటం తప్ప ఏం మిగిలింది బేటీ. రోజురోజుకూ కొత్తకొత్త పాటలు పుట్టుకొస్తున్నయ్. ఒక పాట ప్రాక్టీస్ చేసేసరికే మరోపాట పుట్టుకొస్తుంది. నిన్న ఊరేగింపులో పెద్ద గొడవ జేసింద్రు. 'మేరే హిందుస్తాని' పాట మీద డోలు పగిలింది. ఒకప్పుడు ఎంత శ్రావ్యమైన పాటలు పాడేటోళ్లం... సీతమ్మ పెళ్లికూతురాయెనే పాట జిల్లాలో నా లెక్క ఎవడూ ఊదకపోయేవారు. మా బ్యాండుమేళం వినేటోల్లేగాని... మా ఆకలి సప్పుళ్లు వినిటోడే లేకపాయె. అందుకే ఇమాంగాని కొడుకు వీడియో దీస్కుంటగని బ్యాండు మాత్రం వాయించనన్న అన్నాడు..." సలీం నోటినించి ఆవేదనగా వస్తున్న మాటలు షబీనా మనసుని కూడా తొలిచేసాయి.


కె.వి.నరేందర్

"సరేగాని... కొంచెంసేపు పడుకో నాన్నా... ఈమధ్య నీకు ఆయాసం కూడా బాగా వస్తోంది" అంది పక్కపరుస్తూ.

"అదికాదు బేటీ... నీ పెండ్లిజేస్తే నాకు బరువు దిగిపోద్ది. రేపు పొద్దుగాల్ల చిల్వాకోడూర్ దాకా పోత. అక్కడ పిల్లగాడు ఉన్నడట. రజాక్‌గాని తీసుకపోయి చూసత్త..." అన్నాడు.

"రేపు పెండ్లిల్లు లేవా మరి?" అడిగింది షబీనా.

"రేపట్నించి తెలుగోల్లకు మూఢం బిడ్డా... మూడు నెల్ల దాకా ఏమీలేవు. గిప్పుడు మనకు మంచిరోజులాయె" అంటూ పడుకున్నాడు.

షబీనా బావి దగ్గరకెళ్లి గిన్నెలు తోముతూ పెళ్లికొడుకు గురించి ఊహల్లో మునిగిపోయింది.

** ** **

మర్నాడు సలీం అబ్బాయిని చూడటానికి వెళ్లగానే... షబీనా ఇంట్లో ఒంటరి సీతాకోకచిలుకలా ఎగిరింది. ఆకలి వేయలేదు. అన్నం తిన్నట్టు చేసింది. గోడకున్న గడియారం వంక, తండ్రి అలికిడి కోసం దర్వాజా వంక చూస్తూ గడిపింది. 'ఒకవేళ అబ్బాయి రేపే పెళ్లిచూపులకు

వస్తానంటే...' అన్న ఊహరాగానే ఏ సల్వార్ కమీజ్ వేసుకోవాలి అనుకుంటూ పాత సూట్‌కేసులోంచి బట్టలన్నీ తీసింది.

అన్నీ పాతవే.

కనీసం మంచి చీరెలు కూడా లేవు.

అన్నీ వెదుకుతుంటే... సూట్‌కేసు అడుగున పసుపుపచ్చటి పంజాబీ డ్రెస్సు పట్టుది కనపడింది.

అదంటే షబీనాకి ప్రేమ!

దానిమీది అద్దాల డిజైన్‌లంటే మరీ ప్రేమ!! అది బయటికి తీసింది.

ఆ డ్రెస్సు ఏడాది కిందట ఓ పెళ్లి కూతురు పెళ్లయ్యాక చీరెలు తప్ప వీటితో పనేంటని తన డ్రెస్సులన్నీ బ్యాండ్ వాళ్లకి పంచిందట. అది ముడతలుగా కనపడటంతో గబగబా బావిదగ్గరకెళ్లి ఉతికింది. అది ఆరేంతసేపు ఇంట్లో కాలుగాలిన పిల్లిలా తిరుగుతూనే వుంది. ఈలోపు బొగ్గుల్తో ఇస్త్రీపెట్టె రెడీచేసింది. జాగ్రత్తగా ఇస్త్రీ చేశాక తృప్తిగా చూసుకుంది. డ్రెస్సుకి సెంటు పూసి మడిచిపెట్టింది. పాపిటనిండా అద్దుకోవటానికి మెరుగుకోసం కిరాణా కొట్టుకి పరిగెత్తింది.

కొట్టునించి వస్తూనే ఇంట్లో తండ్రిని చూసి సిగ్గుల మొగ్గయింది. ఏమీ అడగలేదు. తండ్రికి భోజనం వడ్డించి మొహంలోని భావాల్ని చదవడానికి ప్రయత్నిస్తూ ఎదురుగా కూచుంది.

రెండు ముద్దలు తిన్నాక సలీం చెప్పాడు.

"పిల్లగాడు మంచిగనే ఉన్నాడు. మస్కట్‌పోయి సంపాదిత్తండట. కాకపోతే కట్నం బాగా అడుగుతుండ్రు. ఎనభైవేలు కావాల్నట. పదిహేను వేలు, సైకిలు, గడియారం ఇస్తనని నేను చెప్పిన. ఎనభైవేలు సుజుకి బండి గావల్నట. కుండబద్దలు కొట్టినట్టు సెప్పిండ్రు. మనం అందుకునే సంబంధంకాదని ఎనుకకు మర్లినం. రజాక్‌భాయ్ ఎల్లుండి చెర్లపల్లెకు పోదామన్నడు. అక్కడో పిల్లగాడున్నడట..." సరిగా తినకుండానే చేయి కడుక్కొని లేచిండు సలీం.

షబీనా మనసు మూగబోయింది.

పసుపుపచ్చ పంజాబీ డ్రెస్సు కళ్లనిండా కనపడుతోంది.

తూనీగ రెక్కలు విరిచినట్లు... సాగిపోయే పాట తెగిపోయినట్టు... స్తబ్ధుగా అయింది. సలీం అలసటతో పక్కమీద ఒరిగాడు. షబీనా తేరుకుంటూ బావి దగ్గరికెళ్లింది అంట్లు తోమడానికి.

మనసుని గోనెసంచిలో కట్టి పడేసినట్టు స్తబ్దత.

ఎన్నో పెళ్లిళ్లకు వెళ్లొచ్చిన ప్రతిసారీ... తనకీ అదే రీతిలో పెళ్లిచేస్తానని చెప్పి నవ్వించే తండ్రి తన పెళ్లికోసం ఎన్ని గడపలు తొక్కాలోనన్న ఆలోచనతో మెదడు మొద్దుబారుతోంది.

గిన్నెలన్నీ తోమేసి ఇంట్లోకి వచ్చి పంజాబీ డ్రెస్సుని మళ్లీ సూట్‌కేసులో పెట్టబోతూ తండ్రిని చూసి అవాక్కయింది.

"అదేంటయ్యా... బ్యాండ్ డ్రెస్ వేసుకున్నవ్. ఇప్పుడు మూధం అన్నవ్‌కదా. మరి పెళ్లెవరిది?"

సలీం పేలవంగా నవ్వాడు.

"మూధం పెళ్లిళ్లకు గాని... చావులకు వుండదమ్మా" అన్నాడు బాజాని గుడ్డతో తుడుస్తూ.

"చావా... ఎవరు... పో....యా... ర...ట..." అంది కొంచెం ఆందోళనగా.

"గొప్పోళ్ల ఇళ్లల్లో శవయాత్ర కూడా పెళ్లిలాగే సాగుతుందమ్మా. ఇప్పుడే రజాక్ భాయ్ వచ్చి చెప్పి వెళ్లాడు. తొందరగా వెళ్లాలట. కాకపోతే మా బాధంతా ఒకటే... ఆ పిల్ల పెళ్లికి కూడా మేమే బాజాలు వాయించాం. ఏడాది తిరక్కముందే ఆ పిల్లని కట్నం కోసం చంపేసారట. దొంగ గడ్డి కొడుకులు..."

"అయ్యో పాపం... ఎవరు నాన్నా ఆమె" అంది షబీనా బాధగా.

"అదే... పోయిన ఎండాకాలం పట్టుది పంజాబీ డ్రెస్సు తెచ్చానే... ఆ అమ్మాయిచ్చిందే. పాపం ఆ పిల్లే చచ్చిపోయిందట. కాదు కాదు చంపేసిండ్రట"

ఆ మాటతో షాక్‌తిన్న షబీనా చేతిలోని పంజాబీ డ్రెస్సు గబుక్కున జారిపోయింది.

"పిల్ల ఎంత ముద్దుగుండె బేటీ... కండ్లల్ల కనపడుతంది. పొట్టతో వుందని కూడా చూల్లేదట రాక్షసులు. నాకైతే ఇంకా పెళ్లికూతురు లెక్కనే కనపడుతుంది" అంటూ సలీం నెత్తిపై కుచ్చుల టోపీ పెట్టుకున్నాడు.

బాజా తీసుకొని గబగబా వెళ్లిపోతూ "షబీనా బేటీ... తలుపేసుకో నేను వచ్చేసరికి రాత్రి అయితది" అనుకుంటూ వెళ్లిపోయాడు.

'రఘుపతి రాఘవ రాజారాం...'

షబీనా చెవుల్లో చావుమేళం హోరు... కన్నీటి తెరల మధ్య తండ్రి వెళ్లినవైపే చూస్తుండిపోయింది.

పంజాబీ డ్రెస్సు మీద పెంచుకున్న మమకారం..., భయంతో విరిగిపోయింది. గుండె చిరిగిపోయింది.

'పెళ్లి...'

ఆ పదం గుర్తొచ్చి మనసు గడగడా వణికిపోయింది.

** ** **

# ఇంగ్లీషు మాటలు అనివార్యం

మనభాష- 27



డి.చంద్రశేఖరరెడ్డి

ఆంగ్ల విద్యావిధానం వల్లగాని, ఆధునిక సమాజం అంతర్జాతీయ లక్షణం వల్లగాని ఇంగ్లీషు, ఇతర యూరోపియను భాషల పదాలు మన భాషలోకి వచ్చి చేరాయన్నది మాత్రం వాస్తవం. నిరంతరమూ పెరుగుతూ ఉన్న సాంకేతిక విజ్ఞానం కూడా మనకు ఇంగ్లీషు ద్వారానే సంక్రమిస్తూ ఉంది కాబట్టి ఇంగ్లీషు మాటలను అరువు తెచ్చుకోవడం అనివార్యం. అయితే అవసరం లేని సందర్భాలలో కూడా ఇంగ్లీషు మాటల వాడుక హానికరమేననక తప్పదు.

ఇంగ్లీషు, ఇతర యూరోపియను భాషాపదాలను అరువు తెచ్చుకొనేటప్పుడు అవలంబించే పద్ధతులేమిటి? ఇది ముఖ్యంగా పదం చివర ఎట్లా ఉండాలి అన్నదాన్ని బట్టి ఉంటుంది. ఈ మాటలు అజంతమయిన మాటల్ని అజంతాలుగానే తెచ్చుకుంటాం. హలంతమయిన మాటల విషయంలోనే వాటిని అజంతాలుగా చేసుకోవాలా? హలంతాలుగానే ప్రయోగించాలా? అన్న సమస్య వస్తుంది. వాటిని యథాతథంగా హలంతాలుగానే వాడే సంప్రదాయం ఇటీవల కొంత పెరుగుతూ ఉన్నప్పటికీ అజంతాలుగా మార్చుకొనే సంప్రదాయమే కొంత బలంగా ఉంది. విడిమాటను వాడడంలో ఒక పద్ధతి, ప్రత్యయం చేర్చినప్పుడు వాడడంలో మరొక పద్ధతీ కూడా వాడుతున్నారు.

ఇంగ్లీషు మాటలను అజంతాలుగా మార్చుకొంటే అవి పొందే మార్పులేమిటి?

కొన్ని మాటలు క్, గ్, వ్, ర్, చ్, జ్ మొదలయిన విధంగా అసంయుక్తంగా, అద్విరుక్తంగా అంతమవుతాయి. ఈ మాటల చివర ఒత్తు లేని హల్లు ఉంటుందన్నమాట. ఉదాహరణకు చెక్, బుక్ అనే మాటలను తీసుకోవచ్చు. ఇవి చెక్కు, బుక్కు అవుతాయి. పిక్నిక్ పిక్నిక్కు అవుతుంది. ఈ మాటలలో చివర ఉన్న హల్లుకు ముందు హ్రస్వమయిన అచ్చు ఉంది. ఇటువంటి సందర్భాలలో ఈ హల్లు ద్విరుక్తమవుతుంది. అంటే క-క్క అవుతుంది. తక్కిన హల్లులు కూడా అంతే. రగ్ రగ్గు అవుతుంది. రిగ్ రిగ్గు అవుతుంది. మగ్ మగ్గు, లెగ్ లెగ్గు అవుతాయి. సామాన్యంగా లెగ్ వంటి మాటలను వాడవలసిన అవసరం రాదుకాని కొన్ని ప్రత్యేక సందర్భాలలో వాడవలసి వస్తుంది. రెండు, మూడు భాగాలుగా ఉండే క్రీడల్లో సెకండ్ లెగ్, థర్డ్ లెగ్ అని వాడుతుంటారు. రెండో భాగం, మూడో భాగం అనో రెండో పాదం, మూడోపాదం అనో కూడా వాడవచ్చు. సెట్ సెట్టు అవుతుంది. బెట్ బెట్టు, మార్కెట్ మార్కెట్టు, క్రెడిట్ కెడిట్టు, బ్రాకెట్ బ్రాకెట్టు, సీక్రెట్ సిక్రెట్టు అవుతాయి. క్రికెట్, రాకెట్, లాకెట్, కిట్, జెట్, జాకెట్ మొదలయిన పదాలనీ ఇంతే. బ్రెడ్ బ్రెడ్డు అవుతుంది. త్రెడ్ త్రెడ్డు అవుతుంది. లెడ్ లెడ్డు అవుతుంది. మిత్ మిత్తు అవుతుంది. తకారాంతమయిన పేర్లు కూడా ఇంతే. మాక్‌బెత్ మాక్‌బెత్తు అవుతుంది.

మేకప్, మేకప్పు అవుతుంది. కప్ కప్పు, లాకప్ లాకప్పు అవుతాయి. టబ్ టబ్బు అవుతుంది. క్లబ్ క్లబ్బు అవుతుంది. పిన్ పిన్ను అవుతుంది. బన్ బన్ను, గన్ గన్ను, జిన్ జిన్ను అవుతాయి. బిల్ బిల్లు అవుతుంది. మిల్ మిల్లు అవుతుంది. బెల్ బెల్లు అవుతుంది. లవ్ లవ్వు అవుతుంది. ఫర్ ఫర్రు అవుతుంది. సెస్ సెస్సు అవుతుంది. ప్రెస్ ప్రెస్సు అవుతుంది. డ్రెస్ డ్రెస్సు అవుతుంది.

ఈ హలంత పదాలలో చివరి హల్లుకు ముందు దీర్ఘం కాని, బిందువు (సున్నా) కాని ఉన్నట్లయితే ఆ హల్లు ద్విరుక్తం కాదు. ఉదాహరణకు లాక్ లాకు అవుతుంది కాని లాక్కు కాదు. గ్రీక్ గ్రీకు అవుతుంది. షాక్ షాకు అవుతుంది. అట్లాగే లింక్ లింకు, బాంక్ బాంకు, టాంక్ టాంకు, రాంక్ రాంకు, జింక్ జింకు అవుతాయి. అదేవిధంగా కింగ్ కింగు, స్ట్రాంగ్ స్ట్రాంగు, రింగ్ రింగు, సాంగ్ సాంగు, బ్లీడింగ్ బ్లీడింగు, కౌంటింగ్ కౌంటింగు అవుతాయి. బ్యాగ్ బ్యాగు అవుతుంది. సీట్ సీటు, ఓట్ ఓటు, సెంట్ సెంటు అవుతాయి. పాంట్ పాంటు అవుతుంది. ఫ్లాట్ ఫ్లాటు అవుతుంది. బ్లేడ్ బ్లేడు, రాడ్ రాడు, లోడ్ లోడు, కోడ్ కోడు అవుతాయి. రోడ్ రోడు కావాలి. కొందరు రోడు అని వాడినా ఎక్కువమంది రోడ్డు అనే వాడుతున్నారు. దీన్ని ఒక ప్రత్యేక రూపంగా గుర్తించవచ్చు.

బ్రాండ్ బ్రాండు అవుతుంది. లాండ్ లాండు అవుతుంది. సీల్ సీలు అవుతుంది. రీల్ రీలు అవుతుంది. ప్రిన్సిపాల్ ప్రిన్సిపాలు అవుతుంది. క్రేన్ క్రేను, వాన్ వాను, క్రౌన్ క్రౌను అవుతాయి. కార్ కారు అవుతుంది. బార్ బారు అవుతుంది.

హలంత పదంలో చివరి హల్లుకు ముందు ఐ, ఔలు ఉన్నా హల్లుకు ద్విత్వం రాదు. అంటే లైన్ లైను అవుతుందే తప్ప లైన్ను కాదు. లైట్ లైటు, వైట్ వైటు, రైట్ రైటు, మైల్ మైలు, జైల్ జైలు, చైర్ చైరు, సైడ్ సైడు అవుతాయి. ఔట్ ఔటు అవుతుంది. బ్రౌన్ బ్రౌను, క్రౌన్ క్రౌను, బ్లౌజ్ బ్లౌజు, బౌల్డ్ బౌల్డు, పౌన్ పౌను అవుతాయి.

ఇంగ్లీషులో పదాంతంలో ద్విరుక్త వర్ణాలుండవు. పదమధ్యంలో కూడా కొన్నిచోట్ల వర్ణక్రమంలో ద్విరుక్తత ఉన్నా ఉచ్చారణలో అది తొలగిపోతుంది. తెలుగువర్ణక్రమంలో రాసేటప్పుడు వాటిని అద్విరుక్తంగానే రాస్తాం.

లిటిల్ అనే ఇంగ్లీషు మాటలో రెండు 'టి'లు ఉంటాయి, కాని ఉచ్చారణలో ఒకటే 'టి'. తెలుగులో రాసినప్పుడు కూడా అద్విరుక్తంగానే రాస్తాం. కెటిల్, బాటిల్, సెటిల్ వంటివి దీనికి ఉదాహరణలు. పదాంతంలో కూడా ఇంగ్లీషులో ద్విరుక్త హల్లులుంటాయి. కాని వాటి ఉచ్చారణ అద్విరుక్తంగానే ఉంటుంది. మిల్‌లో రెండు 'ఎల్'లు ఉన్నాయి. తెలుగులో మిల్లు అని రాస్తాం. అయితే తెలుగులో 'ల్లు' రాయడానికి కారణం ఇంగ్లీషులో రెండు 'ఎల్'లు ఉండడం కాదు. ఒకే 'ఎల్' ఉన్నా తెలుగులో ద్విరుక్తంగానే రాస్తాం. దీర్ఘాచ్చు తర్వాత రెండు 'ఎల్'లు ఉన్నా తెలుగులో అది అద్విరుక్తంగానే ఉంటుంది. ఉదాహరణకు వాల్‌ని తీసుకోవచ్చు. తెలుగులో వాలు అవుతుంది. బాల్ బాలు అవుతుంది. ఈ పదాలన్నింటిలోనూ చివర వచ్చి చేరిన అచ్చు 'ఉ' కావడం గమనార్హం.